**కథ**

# ధృక్పథం

ఫోను మ్రోగుతూంటే రిసీవరు తీసింది సునీత.

"హలో"

"హలో నమస్తే. నేను చిత్తూరు నుండి మాట్లాడుతున్నాను. కాస్త సతీష్‌ని పిలుస్తారా?"

"ఎన్నిసార్లు పిలవాలండీ ఆయన్ను?"

"విషయం అర్జెంటు కనుక మిమ్మల్ని యిబ్బంది పెడ్తున్నాను"

"సారీ. ఇది ఎస్.టి.డి. బూత్ కాదు. మీరు ఆయన ఆఫీసుకు చేయండి."

"సారీ అమ్మా. సారీ ఫర్ ది ఇన్‌కన్వీనియన్స్" శేఖర్ ఫోన్ పెట్టేశాడు.

సతీష్, శేఖర్ పినతండ్రి శ్రీనివాసరావు కొడుకు. శ్రీనివాసరావుకు రెండురోజులుగా ఆరోగ్యం బాగుండటం లేదు. అందువల్ల సతీష్‌ను ఒకసారి పిలిపిద్దామని శేఖర్ ఫోన్ చేశాడు. అయితే ఆ అమ్మాయి పిలవడం కుదరదు అని చెప్పడంతో రెండు గంటల తర్వాత అతని ఆఫీసుకు ఫోన్ చేసి మాట్లాడాడు.

''నేను సాయంత్రం బయలుదేరి వస్తాను. ఉదయాన్నే మా ఓనర్స్ యింటికి ఫోన్ చేసి ఉండవచ్చుగా అన్నయ్యా. నీకు బిల్లు తక్కువయ్యేది.''

''ఫర్వాలేదులే. నువ్వు వచ్చాక మాట్లాడుకుందాం. బై''

''బై''

బిల్లు చెల్లించి ఆఫీసు వైపు నడిచాడు శేఖర్.

★ ★ ★

సంవత్సరం తర్వాత-

శేఖర్, సతీష్ పనిచేస్తున్న ఊరికి వచ్చాడు. సతీష్ చెప్పిన అడ్రసును బట్టి ఇల్లు సులభంగానే కనుక్కొన్నాడు.

ఇంటిముందు నిలబడి ''సతీష్'' అని పిలిచాడు. ఇంటి లోపల్నుంచి పాతికేళ్ళ అమ్మాయి వచ్చింది. చాలా అందంగా ఉంది ఆ అమ్మాయి.

''యారు బేకు'' కన్నడంలో అడిగింది ఎవరు కావాలని.

''సతీష్''

''వన్ మినిట్'' అంటూ లోపలికెళ్ళి ''సతీష్, సమ్‌బడీ కేమ్ ఫర్ యూ'' అంది. సతీష్ బయటికొచ్చి శేఖర్‌ను చూసి ఆశ్చర్యపోయాడు.

''అన్నయ్యా. వాటే సర్‌ప్రైజ్. ఫోను చేసుంటే బస్టాండుకు వచ్చేవాణ్ణిగా''

''చెప్పి వచ్చుంటే ఈ ఎగ్జయింట్‌మెంట్ నీకు కలిగేదా?''

ఆ ఇంటి ప్రక్కనే ఉన్న చిన్న పోర్షనులోకి అన్నయ్యను పిలుచుకొని వెళ్ళాడు.

''ఇది నా ఇల్లు. ఎలా ఉంది?''

''బాగుంది. ఓ బ్రహ్మచారి ఉండేందుకు సరిపోతుంది''

''ఈ రోజు బ్రహ్మచారితోబాటు ఓ సంసారి కూడా సర్దుకోవాలి పాపం'' అన్నాడు సతీష్ నవ్వుతూ.

శేఖర్‌కు ఆ క్రొత్త వాతావరణం ఎంతగానో నచ్చింది. రొటీన్ లైఫ్‌తో విసిగిపోయిన అతని మనసుకు స్థలం మార్పు ఎంతో రిలీఫ్ నిచ్చింది.

ఇద్దరూ హోటల్‌కెళ్ళి భోంచేశారు. రాత్రి సెకండ్ షో సినిమాకు వెళ్ళారు. సినిమా అయ్యాక మాట్లాడుకుంటూ నడవసాగారు.

''అన్నయ్యా. సునీత ఎలా ఉంది?''

''సునీత ఎవరు?''

''సారీ. నీకు పరిచయం చేయలేదు కదూ. సునీత మా యింటి ఓనరు అమ్మాయి. నువ్వు వచ్చావని నాకు చెప్పిందే, ఆ అమ్మాయి''

''ఆ అమ్మాయా. చాలా బాగుంది. ఏమిటి విషయం?''

''నేను ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాను''

''వెరీగుడ్''

''ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమిస్తోంది''

''వెరీగుడ్''

''మీరు ఓ.కె. అంటే మేమిద్దరం పెళ్ళి చేసుకొంటాము''

''ఆ అమ్మాయి తల్లిదండ్రులు కూడా ఓకే అనాలిగా.''

''అన్నారు. మా అమ్మానాన్నా నా పెళ్ళి బాధ్యత పూర్తిగా నీమీదే పెట్టారు కదా. కాబట్టి మీరు సరేనంటేనే నా పెళ్ళి సునీతతో జరుగుతుంది''

''నాకు ఏం అభ్యంతరం కనిపించడం లేదు. నాకు కావలసింది నీ ఆనందం''

''థాంక్యూ''

''నేను థాంక్స్ చెప్పాలి నీకు. అమ్మాయిని వెతికే శ్రమ తగ్గించావు''

మరుసటి రోజు సునీతను శేఖర్‌కు పరిచయం చేశాడు సతీష్. వాళ్ళూ తెలుగువాళ్ళే కావడం వల్ల భాష సమస్య ఉండదు అనుకొని సంతోషించాడు శేఖర్.

''మీ గురించి ఎప్పుడూ చెబుతూంటాడు సతీష్. మీరు అతనికి ఫ్రెండ్, ఫిలాసఫర్ అండ్ గైడ్ అని. మీ వల్లే తను ఈరోజు ఈ స్థితిలో ఉన్నానని చెప్పాడు'' అంది సునీత.

''చూసే మనసును బట్టి ఈ ప్రపంచంలో మంచీ, చెడ్డా ఉంటుంది. వాడి మనసు మంచిది కాబట్టి అందరిలో మంచే కనబడుతుంది వాడికి. నేను చేసింది ఎక్కువేమీ కాదు. కానీ వాడంటే నాకు చాలా యిష్టం'' అన్నాడు శేఖర్.

ఇంతలో తల్లి పిలిస్తే ''ఒక్క నిముషం'' అంటూ లోపలికెళ్ళింది. తర్వాత రెండు ప్లేట్లలో బజ్జీలతో వచ్చింది.

''తీసుకోండి. వేడిగా ఉన్నాయి''

''నా ఫేవరేట్ టిఫిన్ యిది'' అంటూ కొద్దిగా తిని ''చాలా రుచిగా ఉంది'' అన్నాడు శేఖర్.

''అన్నయ్యా! సునీత కూడా వంట, టిఫెన్లు చాలా బాగా చేస్తుంది'' అన్నాడు సతీష్.

''అదృష్టవంతుడివి''

''మీరు రాత్రి మా యింటికి భోజనానికి రండి'' అంది సునీత.

''ఎందుకమ్మా మీకు అనవసరంగా శ్రమ?''

''ఫరవాలేదండి. ఇటీజ్ అవర్ ప్లెజర్''

ఆ రోజు రాత్రి సునీత తల్లిదండ్రులతో సతీష్, సునీతల పెళ్ళి విషయం మాట్లాడాడు శేఖర్. అతనికి వాళ్ళ ఫ్యామిలీ ఎంతో నచ్చింది. సునీత తర్వాత ఒక అబ్బాయి ఉన్నాడు వాళ్ళకు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సునీత బి.ఎస్.సి. కంప్యూటర్స్ చేసింది.

''నేను ఊరికెళ్ళాక మా చిన్నాన్నతో, సతీష్ అన్నావదినలతో మాట్లాడతాను. వీలైనంత త్వరగా ఆ శుభకార్యం జరిపిచ్చేద్దాం'' అన్నాడు శేఖర్, సునీత తండ్రితో.

''పిల్లలు ప్రేమించుకున్నారని తెలిసి సంతోషపడ్డాను గానీ సతీష్ పెద్దల నుండి ఎటువంటి రియాక్షన్ వస్తుందోనని మనసులోనే టెన్షన్‌గా ఉండింది. మీరొచ్చాక, మీతో మాట్లాడాక నా ఆదుర్దా తగ్గింది. మీలాంటి మంచి మనసున్న పెద్దలున్న యింటికి మా అమ్మాయిని పంపడం నా అదృష్టంలా భావిస్తున్నాను.''

''అది మా అదృష్టం కూడా. మీ సునీత బాగుంది, చదువుకొంది, మర్యాదా, మన్ననా తెలిసినది. కాదనటానికి మాకే కారణం ఉంది. మీరు హాయిగా ఉండండి. ఆమెను మా బిడ్డలా చూసుకొంటాం'' అన్నాడు శేఖర్.

''థాంక్యూ'' అంటూ చేయి కలిపాడు సునీత తండ్రి.

భోజనాలయ్యాక అన్నదమ్ములిద్దరూ వీధి చివర ఉన్న ఎస్.టి.డి. బూత్‌కెళ్ళారు. శేఖర్, భార్య రాధికకు ఫోన్ చేశాడు.

''హలో ఫ్రెండ్. హౌ ఆర్ యూ'' శేఖర్ అన్నాడు.

''ఫైన్. మీరెలా ఉన్నారు. బెంగుళూరుకు పాతిక కిలోమీటర్ల దూరంలోనే ఉన్నారు కదా. చలి ఎక్కువగా ఉందా? జలుబేం చెయ్యలేదు కదా. చలిలో తిరగొద్దండి''

శేఖర్ నవ్వసాగాడు. తర్వాత నవ్వు ఆపి-

''రాధీ. నీ నుంచి వలపు బాణాలు ఎదురు చూస్తుంటే ప్రశ్నల బాణాలు సంధిస్తే ఎలా? పిల్లలెలా ఉన్నారు?''

''బాగున్నారు''

''రాధీ! నువ్వక్కడ, నేనిక్కడ. మనం విరహం అనుభవించి ఎన్ని సంవత్సరాలైంది? నేను ఎక్కడికి బయలుదేరినా వెనకే నువ్వూ బయలుదేరుతావు మామూలుగా''

''రాముని వెంట సీతలా''

''కృష్ణుని ప్రక్కన సత్యభామలా''

''మీ పోలిక అర్థమైంది. మిమ్మల్ని సాధిస్తాననేగా అర్థం''


''జీవితంలో ఏదో ఒకటి సాధించమనేగా పెద్దలు చెబుతుంటారు''

''చాల్లెండి. ఎవరైనా వింటే నిజంగానే మిమ్మల్ని సాధిస్తున్నాననుకొంటారు. అవునూ... సతీష్ వింటున్నాడా మీ మాటలు''

''లేదు. అమాయకంగా రోడ్డుపై వెళుతున్న బస్సుల్ని చూస్తున్నాడు. అన్నట్టు సతీష్ నీకు తోడికోడల్ని తెస్తున్నాడు''

''నిజంగానా? పిలవండి సతీష్‌ని''

ఆ తర్వాత సతీష్‌తో చాలాసేపు మాట్లాడింది రాధిక.



''సతీష్! ఆ అమ్మాయి మీ అన్నయ్యకు నచ్చిందంటే గొప్పే. ఒక పట్టాన ఓకే చేయరు ఆయన.

**సి.ఎన్.చంద్రశేఖర్**

కంగ్రాట్స్. ఈసారి వచ్చేటప్పుడు ఆ అమ్మాయి ఫోటో ఉంటే తీసుకురా''

''అలాగే వదినా''

డబ్బులు చెల్లించి బయటకు వచ్చారు.

''సతీష్. నీ ట్రాన్స్‌ఫర్ విషయం ఏమైంది'' శేఖర్ అడిగాడు.

''ఇంకో ఆరు నెలల్లో వచ్చేయవచ్చు. చిత్తూరికే వేస్తామని అన్నారు''

''వెరీగుడ్. నువ్వు నాకు దగ్గర్లో ఉంటే మానసికంగా ఎంతో ధైర్యంగా ఉంటుందిరా నాకు''

సతీష్‌కు కంట్లో నీరు తిరిగింది. అతని అన్నయ్య అభిమానానికి.

''అన్నయ్యా. సునీత వల్ల మన మధ్య గొడవలేం రావుగా. ఆమె మంచిదే అయినా మాట కాస్త కటువుగా ఉంటుంది ఒక్కోసారి''

''ఫర్వాలేదు. పెళ్ళయ్యాక తనే తెల్సుకుంటుందిలే సతీష్. క్రొత్తగా పెళ్ళైన ఆడపిల్ల నిప్పులో కాలిన ఇనుములాంటిది. ఎలాగైతే అలాంటి ఇనుమును మనం ఎలా వంచితే అలా తయారౌతుందో అలాగే మనం మంచిగా ఉంటే తనూ అలాగే తయారౌతుంది. నువ్వు అలాంటి భయాలేం పెట్టుకోకు''

కొంతసేపటి తర్వాత శేఖర్ అన్నాడు.

''రేపు ఉదయం బయలుదేరుతాను నేను''

''అదేం నాలుగు రోజులు ఉంటానన్నావు. వదిన మీద మనసు పోయిందా''

''నిజమే. పిల్లల కాన్పుల సమయంలో తప్ప మేమిద్దరూ ఒకరిని విడిచి ఒకరు దూరంగా ఉండినది చాలా తక్కువ''

''మీ నుంచి ఎంతో నేర్చుకోవాలి మేము'' మనసులోనే అనుకొన్నాడు సతీష్.

★ ★ ★

సతీష్ పెళ్ళి సునీతతో వైభవంగా జరిగింది. శేఖర్ మధ్యవర్తిగా ఉండి యిరువైపులా ఎటువంటి మనస్పర్థలూ, పొరబాట్లు జరగకుండా చూసుకొన్నాడు.

పెళ్ళయ్యాక సునీత తండ్రి శేఖర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు.

''మీరు ఉన్నందువల్ల అంతా సాఫీగా జరిగిపోయింది. ఒక ఆడపిల్ల పెళ్ళి చేసినట్లు అనిపించలేదు నాకు. ఏదో వనభోజనానికి ఆప్తులతో కలిసి

వచ్చినట్లే అనిపించింది''

''అంతా భగవంతుడి దయ. కొన్ని పనులు చేయించటానికి ఆయన కొంతమందిని ఎన్నుకుంటాడు. అలా ఎన్నికైన వాణ్ణి నేను. అయితే ఆ అవకాశం యిచ్చినందుకు ఆయనకు కృతజ్ఞుణ్ణి''

''ఇంత చిన్న వయసులోనే ఎంతో గొప్పగా మాట్లాడతారు మీరు''

''వయసు చిన్నదైనా అనుభవం ఎక్కువ నాకు. మా బంధువుల పిల్లలు పెళ్ళిళ్ళన్నీ కలిపి దాదాపు ఓ పదిహేను పెళ్ళిళ్ళకు బాధ్యత తీసుకొని అన్నీ చేశాను నేను. అయితే ఆ 'నేను' అన్న అహంకారం రాకుండా ఉండటానికి ఆ భగవంతుణ్ణే కర్తను చేస్తాను నేను''

''చిన్నవారైనా మీ నుంచి ఎంతో నేర్చుకోవాలి నేను'' నిజాయితీగా అన్నాడు సునీత తండ్రి.

''అన్నయ్యా. బస్సు వచ్చింది. బయలుదేరదామా'' అంటూ వచ్చాడు సతీష్.

''సతీష్. నేను లగేజ్ విషయం చూసుకొంటాను. మీరిద్దరూ పెద్దలందరి దగ్గరా ఆశీర్వాదం తీసుకొని, అందరికీ చెప్పి మరీ బయలుదేరండి''

''అలాగే'' అంటూ వెళ్ళిపోయాడు సతీష్.

కొద్దిరోజుల్లోనే సతీష్‌కు చిత్తూరు ట్రాన్స్‌ఫరైంది.

''నీ దయవల్ల ఓ ఇంటివాడయ్యాను. అలాగే చిత్తూరులో ఓ మంచి ఇల్లు చూసిపెట్టన్నయ్యా'' సతీష్ అన్నాడు.

''వేరే ఇల్లెందుకు. మా మేడ పై పోర్షను త్వరలో ఖాళీ కాబోతూంది. మీరు అక్కడే ఉండిపోండి''

''ఆ స్వర్గంలో సంసారం పెట్టడం నా అదృష్టం అంటాను''

''టీవీలో తెలుగు సీరియల్స్ ఎక్కువగా చూస్తున్నట్టున్నావు. తగ్గించు'' నవ్వుతూ అన్నాడు శేఖర్.

★ ★ ★

''హలో.. నేను సునీత అమ్మను మాట్లాడుతున్నాను. ఎవరు? శేఖర్‌గారేనా?''

''అవునండీ. నమస్కారం. బాగున్నారా''

''ఆ బాగున్నామండీ. కాస్త సునీతను..''

''పిలుస్తాను. లైనుతో ఉంటారా? మళ్ళీ చేస్తారా?''''అయిదు నిమిషాల తర్వాత చేస్తాను''

''అలాగే''

రిసీవరు పెట్టి మెట్లవరకూ వెళ్ళి ''సునీతా'' అంటూ కేకేశాడు.

''వస్తున్నాను బావగారూ'' అంటూ పరుగెత్తుకొచ్చింది సునీత.

''మీ అమ్మగారి నుంచి ఫోను. అయిదు నిమిషాల తర్వాత చేస్తామన్నారు. కూర్చో''

తర్వాత ఫోనులో తల్లితో మాట్లాడింది సునీత.

నవ్వుతూ లోపలికొస్తున్న భార్యను చూసి-

''ఏమిటి అంత సంతోషంగా ఉన్నావు?'' అని అడిగాడు సతీష్.

''మా అమ్మ ఫోన్ చేసింది''

''ఓహో. అదా అమ్మాయి గారి సంతోషానికి కారణం. ఎవరు చెప్పారు ఫోన్ కాల్ వచ్చిందని?''

''బావగారు చెప్పారు''

''క్రింద నుంచే పిలిచారా, పైకి వచ్చి పిలిచారా?''

అతని వైపు ఆశ్చర్యంగా చూసి ''మెట్ల దగ్గర నుంచి పిలిచారు'' అంది అతడు అవన్నీ ఎందుకు అడుగుతున్నాడో అర్థం కాక.''చూశావా. నీ మెంటాలిటీకి, ఆయన మెంటాలిటీకి ఎంతో తేడానో. ఆయన ఫోన్ చేస్తే, పిలిస్తే పలికేంత దూరంలో నేనున్నా, నువ్వు పిలవలేదు.. నీకు ఫోనొస్తే ఆయన మేడ మెట్ల వరకూ వచ్చి పిలిచారు''

''ఆయన ఫోన్ చేస్తే పిలవనన్నానా. ఎప్పుడు?''

''సంవత్సరం క్రితం. చాలా కచ్చితంగా పిలవనని చెప్పావుట. అఫ్‌కోర్స్ అప్పటికి మన మధ్య ప్రేమ మొదలవలేదు''''ఆ.. గుర్తొచ్చింది. ఆ రోజు అలా అన్నాక నేనూ ఎంతో బాధపడ్డాను. నేను పిలవనని చెప్పాక నాకు యిబ్బంది కలిగించినందుకు ఆయన సారీ కూడా చెప్పారు. అది నా బాధను మరింత పెంచింది. అప్పటికే మీ కోసం రెండు కాల్స్ వచ్చి నేను మిమ్మల్ని పిలిచాను. మళ్ళీ మీ కోసం ఫోనొస్తే చిరాకుపడ్డాను. అయితే ఆరోజు ఫోన్ చేసింది శేఖర్ బావగారా? ఎంత పొరబాటు జరిగింది?'' బాధగా అంది సునీత.

''ఫర్వాలేదు. పొరబాట్లు మానవ సహజం. మరోసారి అలాంటి పొరబాటు జరగకుండా చూసుకోవాలి. నిజానికి ఆరోజు మా నాన్నకు ఆరోగ్యం బాగాలేదని చెప్పడానికి అన్నయ్య ఫోన్ చేశాడు. నువ్వు పిలవననేసరికి ఆఫీసుకు ఫోన్ చేశాడు. ఆ తర్వాత నేను మీ యింటికి ఫోన్ చేస్తూండమని ఎన్నిసార్లు చెప్పినా ఆయన చెయ్యలేదు. డబ్బులు మిగలబెడుతున్నారా అని నేను తమాషా చేస్తే అప్పుడు చెప్పాడు జరిగిన విషయం. మళ్ళీ తనే అన్నాడు. 'ఆ అమ్మాయి అలా చెప్పడంలో తప్పు లేకపోవచ్చు. వాళ్ళ మూడ్స్, యింట్లో పరిస్థితి యివన్నీ కారణం కావచ్చు' అని. చూశావా ఎంత విశాలంగా అవతలి వ్యక్తి గురించి ఆలోచించాడో. మనం నేర్చుకోవాల్సింది యిదే. ఇటువంటి వ్యక్తుల సాంగత్యంలో మనం ఉండటం ఓ అదృష్టంలా భావించి ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలి. మనకేదైనా సదుపాయం ఉండి, అవతలి వ్యక్తికి లేకపోతే అతనికి సహాయపడటానికి మనకు అవకాశం వచ్చిందని సంతోషపడాలి కాని విసుక్కోకూడదు, పనిష్మెంటులా భావించకూడదు.''

''నేను బావగారిని క్షమించమని అడుగుతాను''

''వద్దు. ఆయన అలాంటివన్నీ గుర్తుపెట్టుకోరు. మనసులో ఉంచుకొని సాధించరు. నీ ప్రవర్తన, మంచితనం గురించి ఆయన సంతోషంగా ఉన్నారు. నువ్వెప్పుడూ యిలాగే వుండు. అదే ఆయన్ను క్షమించమని అడిగినంత''

''తప్పకుండా. ఈరోజు నుండి నాక్కూడా ఆయన ఫ్రెండ్, ఫిలాసఫర్ అండ్ గైడ్'' అంది నవ్వుతూ సునీత.

## ఆదరిస్తారా?

**మాజీ మిస్ ఇండియా నేహా దుఫియా దుర్గా ఆర్ట్స్ కొత్త చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో కన్పించనుంది. తరుణ్ హీరో అయిన ఈ చిత్రం అందాలరాణికి తొలిచిత్రం కావడంతో ఎంతో జాగ్రత్తగా నటిస్తోంది. ఈ సాంగ్ చిత్రానికే హైలైట్‌గా నిలుస్తుందంటున్నారు. తెలుగు ప్రేక్షకులు కొత్త తారల్ని బాగా ఆదరిస్తారని ఆశాభావంతో ఉంది నేహా. అన్నట్టు ఈ గ్లామర్ అమ్మాయి అజయ్‌దేవగన్‌తో కలిసి ఖయామత్‌లో నటిస్తూ ఇటు టాలీవుడ్‌తోపాటు బాలీవుడ్‌లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. చూద్దాం ఏం జరుగుతుందో?**

